ఉపాధి లక్ష్యంగా యువతకు శిక్షణ కేంద్రాలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే: బహుళ జాతి సంస్థల్లో ఉపాధి కల్పనే లక్ష్యంగా యువతకు ప్రభుత్వం శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం ఉపాధి కల్పన శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సంజయ్, ఉపాధి కల్పన శాఖ డైరెక్టర్ కృష్ణ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అధునాతన శిక్షణ కేంద్రాల ద్వారా యువతకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈనెల చివరి వరకు ప్రవేశాలకు అవకాశం ఉందన్నారు. మన్ననూర్ ఐటీఐలో అడ్మిషన్ల ప్రక్రియ పర్యవేక్షణకు ప్రత్యేక నోడల్ అధికారులుగా డీపీవో, డీఆర్‌డీఏ, ఐటీడీఏ పీవోను నియమించామన్నారు. విద్యార్థులు ఐటీఐలో చేరేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. శిక్షణ కేంద్రాల్లో వృత్తి నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ ఇస్తారన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన యువత ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధునాతన సాంకేతికతకు కావాల్సిన ఆరు కోర్సుల్లో మన్ననూర్ ఐటీఐలో ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో కార్మిక శాఖ అధికారి రాజ్‌కుమార్, ఉపాధి కల్పన అధికారి రామచందర్, మన్ననూర్ ఐటీఐ ప్రిన్సిపల్ లక్ష్మణస్వామి, కల్వకుర్తి ఐటీఐ ప్రిన్సిపల్ జయమ్మలు పాల్గొన్నారు.

గ్రామాల రాకపోకలకు ఇబ్బందులు కలగొద్దు: జూపల్లి


కొల్లాపూర్ శివార్లో సింగోటం గ్రామం చౌరస్తా వద్ద ఫ్లైఓవర్ వంతెన పనులను పరిశీలిస్తున్న ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కల్వకుర్తి-నంద్యాల జాతీయ రహదారికి (ఎన్‌హెచ్ 167-కె) అనుసంధానంగా ఉన్న గ్రామాలకు వెళ్లే రహదారుల వద్ద ఫ్లైఓవర్ ఎత్తు పెంచి వంతెనలను నిర్మించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం పట్టణానికి సమీపంలో ఉన్న సింగోటం గ్రామ కూడలి వద్ద రోడ్డు వంతెన పనులను పరిశీలించారు. చౌటబెట్ల గ్రామానికి వెళ్లే రోడ్డు వద్ద ఎత్తు పెంచాలని గ్రామస్థులు కోరడంతో ఆయన స్పందించారు. గుత్తేదారులతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా రోడ్డు, వంతెన పనులు చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో గ్రామాలకు వెళ్లే వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగ వద్దన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

జూరాలకు కొనసాగుతున్న వరద

ధరూరు, న్యూస్‌టుడే: జూరాల జలాశయంలోకి వరద కొనసాగుతోంది. జలాశయంలోకి 71 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 11 గేట్లు, జలవిద్యుదుత్పత్తి ద్వారా మొత్తం కలిపి 83 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయంలోకి 45వేల క్యూసెక్కుల చేరుతుండగా దిగువకు 44వేలు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 51 వేలు చేరుతుండగా దిగువకు 45 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. మరో రెండు రోజుల పాటు జూరాలకు వరద నిలకడగా కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

పురపాలికలో డీజిల్ గోల్‌మాల్

నిఘా

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ పురపాలికలో డీజిల్ వాడకంలో అవినీతికి పాల్పడ్డారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో డీజిల్ వినియోగం పేరిట ఇష్టానుసారంగా బిల్లులు చేసుకోవడం సర్వసాధారణంగా మారిపోయింది. పురపాలికలో అవినీతి అక్రమాలపై ఆరోపణలు పెరుగుతున్నా.. అధికారులు మౌనం వీడటం లేదు. ప్రతి నెల కేవలం డీజిల్‌పైనే పెద్ద ఎత్తున గోల్‌మాల్ చేస్తున్నారు. ఇక్కడ జరిగే అవినీతి అక్రమాలపై ఇదివరకే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి వెళ్లడం గమనార్హం. ఇందులో కింది స్థాయి సిబ్బందిని బాధ్యులను చేసి అధికారులు తప్పించుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. పురపాలికలో చెత్త సేకరించే ఆటోలు 13, రెండు ట్రాక్టర్లు, పొక్లెయిన్ ఒకటి, ఒక డోజర్, ఒక ట్యాంకరు ఉన్నాయి. ఇందులో చెత్త సేకరించే ఆటోలు, ట్రాక్టర్లను ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. చెత్త సేకరించే ఆటోలకు రోజు తప్పించి రోజు 10 లీటర్ల డీజిల్ పోస్తారు. ట్రాక్టర్లకు రెండు రోజులకోసారి 20 లీటర్లు ఇస్తారు. వాస్తవంగా వాహనాలకు పోసే డీజిల్ ఖర్చు నెలకు రూ.3 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు ఉంటుంది. కానీ ప్రతి నెల రూ. 7 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు డీజిల్ బిల్లులు డ్రా చేస్తున్నారు. ఇలా రెండేళ్ల కాలంలో రూ. కోటి వరకు అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. పుర కార్యాలయంలో డీజిల్ బిల్లు అధికంగా చేయాలని ఒత్తిళ్లు రావడంతో నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు చేయలేమంటూ ఒక్కరిద్దరు సిబ్బంది చెప్పేశారు. దీంతో మరొకరితో బిల్లులు చేయిస్తున్నారు.

విచారించి చర్యలు..: నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో డీజిల్ తదితర అంశాల్లో అక్రమాలు జరిగాయని మా దృష్టికి వచ్చింది. విచారించి చర్యలు తీసుకుంటాం. విచారణకు ప్రత్యేక అధికారిని నియమిస్తాం. రెగ్యులర్ సిబ్బంది పాత్ర ఉంటే సస్పెన్షన్ చేస్తాం. ఒప్పంద ఉద్యోగులు ఉన్నట్లు తేలితే విధుల్లో నుంచి తొలగిస్తాం. త్వరలోనే పూర్తి స్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకుంటాం.
- దేవసహాయం, అదనపు కలెక్టర్, నాగర్‌కర్నూల్

హెచ్చరిక లేఖతో వెలుగులోకి..: నాగర్‌కర్నూల్ పురపాలికలో పనిచేసే మరో చోటికి ఇటీవల బదిలీపై వెళ్లిన ఏఈ డీజిల్ వినియోగంలో అక్రమాలు జరుగుతున్నాయని, అధికారులకు అధికారిక లేఖలు రాయడంతో అవినీతి వెలుగులోకి వచ్చింది. అయినప్పటికీ ఆయన లేఖలను పట్టించుకోలేదు. డీజిల్ అక్రమాలు అధికంగా చేస్తున్నారని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి వివరించారు. అయినప్పటికి ఈ తంతు యథావిధిగా కొనసాగుతోంది. డీజిల్ అక్రమాలతో పాటు సక్రమంగా నిర్వహణ ఉండటం లేదని, కొన్ని పనులు టెండరు ప్రకారం కాకుండా నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని, వీటిని అరికట్టాలని వివరించారు.


పురపాలక సంఘం కార్యాలయంలో చెత్తను సేకరించే ఆటోలు

పనిచేయకున్నా బిల్లులు..: పురపాలిక కార్యాలయంలో సిబ్బంది పనిచేయకున్నా 8 మంది పనిచేసినట్లుగా బిల్లులు చేసుకున్నారు. ప్రతి నెల ఈ బిల్లులను కాంట్రాక్ట్ ఉద్యోగి ఖాతాలో జమ చేసుకుని అనంతరం డబ్బులు డ్రా చేసుకున్నారు. వీటిని ఇద్దరు అధికారులు పంచుకున్నట్లు సమాచారం. ఇది కొన్ని నెలలుగా సాగుతోంది. కార్యాలయంలో 75 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారికి వేతనాలు మహిళా ఏజెన్సీ ద్వారా డ్రా చేసి ఇస్తున్నారు. వారితో పాటు అదనంగా 8 మంది వేతనాలు ప్రత్యేకంగా కాంట్రాక్ట్ ఉద్యోగి ఖాతాలో వేసి డ్రా చేశారు. ఇటీవలే ఇది బయట పడింది. కార్యాలయంలో అవినీతి వ్యవహారం ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

రూ.1.20 కోట్ల జరిమానా ఏమైనట్లు?

చౌడమ్మకుచ్చ మట్టి తరలించిన వారిపై చర్యలు తీసుకోని నాటి ఏడీ


చౌడమ్మకుచ్చ మట్టి పోసి చదును చేసిన వెంచర్ ఇదే

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం : మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేస్తున్నప్పుడు బాలనగర్‌లోని ఓ రియల్ వెంచర్‌లో జరిగిన అక్రమాలను కప్పిపుచ్చారని, ప్రభుత్వానికి రూ.కోట్లల్లో నష్టం వాటిల్లిందని పేర్కొంటూ రాష్ట్ర గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్.. ప్రస్తుతం జనగామ జిల్లా ఏడీగా ఉన్న విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేయటం కలకలం రేపింది. ఆరాతీస్తే ఆయన మహబూబ్‌నగర్ పట్టణం ఎదిర సమీపంలోని చౌడమ్మకుచ్చను అక్రమంగా తవ్వి భారీ మొత్తంలో మట్టి తరలించిన మట్టి మాఫియా, స్థిరాస్తి వ్యాపారిపైనా చర్యలు తీసుకోలేదని, వారి నుంచి జరిమానా వసూలు చేయకుండా ప్రభుత్వాదాయానికి భారీగా గండి కొట్టారని తెలిసింది. విచారిస్తే ఇలాంటివి చాలా వెలుగుచూసే అవకాశముంది.

మట్టి రవాణా : సరిగ్గా రెండేళ్ల క్రితం మహబూబ్‌నగర్ చుట్టూ మట్టి మాఫియా రెచ్చిపోయింది. కంటికి కనిపించిన గుట్టలన్నీ కరిగించేసింది. అక్రమంగా మట్టిని తరలించి రూ.కోట్లల్లో సొమ్ము చేసుకున్నారు. 2022 సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో ఎదిర శివారులో చౌడమ్మకుచ్చను మట్టి మాఫియా చెరబట్టింది. రాత్రింబవళ్లు ఇక్కడి నుంచి మట్టిని టిప్పర్లలో తిరుమల హిల్స్‌లో అప్పటి కీలక నేతకు బినామిగా చెలామణి అవుతున్న ఓ స్థిరాస్తి వ్యాపారి వెంచర్‌కు తరలించారు. ఈ వ్యవహారాన్ని గుర్తించిన ఎదిరవాసులు 'న్యూస్‌టుడే'కు సమాచారం ఇచ్చారు. క్షేత్రస్థాయి పరిశీలన చేసి 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. అప్పటి మైనింగ్ శాఖ ఏడీ విజయ్‌కుమార్ స్పందించారు. మరుసటి రోజైన 10వ తేదీన తమ సిబ్బందితో వెళ్లి చౌడమ్మకుచ్చతో పాటు మట్టిని తరలించి పోసిన తిరుమల హిల్స్‌లోని వెంచర్‌ను కూడా పరిశీలించారు. టిప్పర్లతో వెంచర్‌లో పోసిన మట్టి ఎత్తు 2.50 మీటర్లు, పొడవు 350 మీటర్లు, వెడల్పు 46 మీటర్లు ఉన్నట్లు కొలతలు వేసి గుర్తించి దాదాపు 60,375 టన్నులు ఉంటుందని తెలిపారు. క్యూబిక్ మీటర్‌కు రూ.20 చొప్పున 10 రెట్ల జరిమానా విధిస్తామని, ప్రభుత్వానికి రూ.1,20,75,000 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ మొత్తం జరిమానాను మట్టి తరలింపునకు కారణమైన వ్యక్తులు, టిప్పర్ల యజమానులపై కేసులు నమోదు చేసి వసూలు చేస్తామన్నారు. నెల రోజులు దాటినా ఏడీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. చర్యలు తీసుకోకపోవడంపై మరోమారు 'న్యూస్‌టుడే' ఏడీ విజయ్‌కుమార్‌ను సంప్రదించగా రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదంటూ మైనింగ్ శాఖ నియమావళిని వివరించే ప్రయత్నం చేశారు.

కార్యాలయంలో కనిపించని దస్త్రాలు : మట్టి తరలింపుపై ప్రస్తుత మైనింగ్ ఏడీ సంజయ్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా అలాంటి దస్త్రాలు, జరిమానా వసూలు చేసిన దాఖలాలు లేవని స్పష్టంచేశారు. మట్టి తరలించే పనిని జడ్చర్ల, అప్పన్నపల్లికి చెందిన కొందరు టిప్పర్ల యజమానులకు స్థిరాస్తి వ్యాపారి అప్పగించారు. ఒక్కో లోడుకు రూ.2,500 నుంచి రూ.3,000 వరకు ధర నిర్ణయించడంతో రాత్రింబవళ్లు తిరుమల హిల్స్‌లో వెంచర్‌కు మట్టిని తరలించారు. నేతల ఆశీర్వాదంతో కేసులే కాదు.. జరిమానా కూడా చెల్లించకుండా టిప్పర్ల యజమానులు తప్పించుకోవటం గమనార్హం.

ఎరువు.. ఇక కాదు బరువు

మరో నోడల్ ఏజెన్సీగా ఆగ్రోస్

గద్వాల, న్యూస్‌టుడే: రైతులకు ఎరువులను మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. ఎరువుల సరఫరా కోసం ప్రస్తుతం ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా మార్క్‌ఫెడ్ మాత్రమే వ్యవహరిస్తోంది. అన్ని ప్రాంతాలకు ఎరువుల సరఫరా సవ్యంగా జరగాలంటే మరో సంస్థకు కూడా బాధ్యతలు ఉండాలని ఆలోచించి వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్)ను మరో నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం ఎంపిక చేసింది. వచ్చే యాసంగి సీజన్ నుంచి ఆగ్రోస్ నేరుగా కంపెనీల నుంచి ఎరువులు తీసుకొచ్చి రైతులకు తమ కేంద్రాల ద్వారా విక్రయించనుంది.

నిరుద్యోగ పట్టభద్రులకు అవకాశం: రెండు దశాబ్దాల కిందట ఆగ్రోస్ ద్వారా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన ఆధునిక యంత్రాలను పరికరాలను రైతులకు రాయితీపై ప్రభుత్వం అందజేసింది. ఇందు కోసం అప్పట్లో జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా ప్రాంతీయ కార్యాలయాలు ఉండేవి. నిధుల కొరతతో అవి ప్రాభవం కోల్పోయి చివరికి మూతపడ్డాయి.


ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం

సిబ్బందిని రాష్ట్ర స్థాయి కార్యాలయంలో ప్రభుత్వం సర్దుబాటు చేసింది. ప్రస్తుతం అంపశయ్యపై ఉన్న ఈ సంస్థ ప్రాణాన్ని నిలబెట్టాలని సర్కారు యోచిస్తోంది. ఇప్పటికే ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను ప్రతి మండలంలో ఒకటి లేదా రెండు ఏర్పాటుకు అవకాశం కల్పించారు. నిరుద్యోగ పట్టభద్రులు వీటిని నిర్వహించేందుకు అనుమతించింది. ప్రస్తుతం వీటి ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయాలు జరుగుతున్నాయి.

రైతులకు మేలు: మార్క్‌ఫెడ్ ద్వారానే కాకుండా ఆగ్రోస్‌తో ఎరువులను సరఫరా చేయాలని ప్రభుత్వం భావిస్తుండటం వల్ల రైతులకు మేలు జరగనుంది. తద్వారా ప్రతి గ్రామానికి సకాలంలో ఎరువులు అందనున్నాయి. అయితే ఇందుకు తగిన విధంగా ఆగ్రోస్ ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. పెద్ద ఎత్తున ఎరువుల నిల్వల కోసం గోదాములు సమకూర్చుకోవాలి. ఆగ్రోస్ ద్వారా ఎరువుల సరఫరా చేపడితే రైతులకు దూరాభారం తగ్గుతుంది. దీనివల్ల ఖర్చు సైతం ఆదా అవుతుంది. సరఫరా కేంద్రాల సంఖ్య పెరగటం వల్ల వానాకాలం యాసంగి సీజన్లలో అన్నదాతలకు సకాలంలో ఎరువులు అందుతాయని జోగులాంబ జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్ అంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..
- సహకార సంఘాలు: 82
- సాగు విస్తీర్ణం: 18.50 లక్షల ఎకరాలు
- ఎరువుల వినియోగం: 3.94 లక్షల మెట్రిక్ టన్నులు

కష్టపడి చదివి.. ఉపకులపతి స్థాయికి ఎదిగి

పీయూ వీసీగా డా.జీఎన్ శ్రీనివాస్ ● నేడు బాధ్యతల స్వీకరణ



పాలమూరు, న్యూస్‌టుడే: పాలమూరు విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా రానున్న జీఎన్ శ్రీనివాస్ సాధారణ రైతు కుటుంబంలో పుట్టి.. అంచెలంచెలుగా ఎదిగారు. చిన్నప్పటి నుంచి చదువుపై ఆసక్తితో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివారు. బీటెక్ పూర్తయిన తర్వాత ఓ ఇంజినీరింగ్ కళాశాలలో పార్ట్‌టైంగా ఉద్యోగం చేస్తూ మరోవైపు సాయంత్రం కళాశాలలో ఎంటెక్ పూర్తి చేశారు. అనంతరం అంచెలంచలుగా ఎదిగి ఉపకులపతి స్థాయికి చేరారు.

159 మందిలో..: పీయూకి మే 21 నుంచి రెగ్యులర్ ఉప కులపతి లేరు. ఈ పోస్టు కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల నుంచి అర్హత కలిగిన 159 మంది దరఖాస్తు చేసుకోగా చివరికి శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ పోస్టుకు డిమాండ్ పెరిగింది. కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసిన తర్వాత ఇక్కడ ఉపకులపతి పోస్టుపై అనేక మంది ఆసక్తి చూపారు. అందులో ప్రభుత్వం అనుభవం కలిగిన ఆచార్యుడికి బాధ్యతలను అప్పగించింది.

కుటుంబ నేపథ్యం: శ్రీనివాస్ స్వస్థలం కరీంనగర్ జిల్లా గంభీరావ్‌పేట మండలం కొత్తపల్లి. తల్లిదండ్రులు నర్సయ్య, ఎల్లవ్వ వ్యవసాయం చేసేవారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు గంభీరావ్‌పేట ప్రభుత్వ పాఠశాలలోనే చదివారు. కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. 1991లో ఎంసెట్ ద్వారా మంచి ర్యాంకు సాధించి జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ విద్యలో ఈఈఈ విభాగంలో చేరారు. 1995లో బీటెక్ పూర్తయిన తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కళాశాలలో పార్ట్‌టైం కింద అధ్యాపకులుగా చేరారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు సాయంత్రం కళాశాల ద్వారా ఎంటెక్ పూర్తి చేశారు. 1997 వరకు సహాయాచార్యులుగా పని చేశారు. 2003లో అనంతపురం జేఎన్‌టీయూలో రెగ్యులర్ పోస్టు కింద అసోసియేట్ ఆచార్యులుగా విధుల్లో చేరారు. 2006లో జేఎన్‌టీయూ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. అక్కడే పని చేస్తూ 2011లో ఆచార్యులుగా పదోన్నతి పొందారు. 2022లో సీనియర్ ఆచార్యులుగా అర్హత లభించింది. నాటి నుంచి నేటి వరకు అక్కడ పని చేస్తున్నారు. వైస్ ప్రిన్సిపల్‌గా, ప్రిన్సిపల్‌గా, పలు కళాశాలలకు మెంటార్‌గా, పరిశోధన కమిటీ ఛైర్మన్‌గా, పలు పోటీ పరీక్షలకు సభ్యుడిగా, వసతి గృహ మేనేజర్‌గా సేవలు అందించారు.

కొత్త వీసీకి సవాళ్లెన్నో..

పీయూలో పలు సవాళ్లు కొత్త ఉపకులపతికి ఎదురు కానున్నాయి. విశ్వవిద్యాలయం సిబ్బందిపై పూర్తి అజమాయిషీ కరవైంది. కొందరు విధులకు వచ్చినట్లు హాజరు వేయించుకుని బయటకు వెళ్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తరగతులపై పర్యవేక్షణ, అధ్యాపకుల అజమాయిషీని పకడ్బందీగా చేయాల్సి ఉంటుంది. లా కళాశాలకు గతేడాది అనుమతి వచ్చినా ఇప్పటి వరకు భవన నిర్మాణం పూర్తి కాలేదు. బాలికల వసతిగృహంలో ప్రస్తుతం ఒక గదిలో 8 మంది ఉంటున్నారు. ఒక గదిలో నలుగురు మాత్రమే ఉండాలి. మరో భవనం నిర్మించినా ఇంతవరకు ప్రారంభించలేదు. పర్యావరణ విద్యకు తరగతి గదుల్లేవు. కొల్లాపూర్, గద్వాల, వనపర్తి పీజీ కేంద్రాల్లో వసతి గృహాల సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

● పీయూకి ఉపకులపతిగా రావడం అదృష్టంగా భావిస్తున్నాను. నేడు వీసీగా బాధ్యతలు స్వీకరిస్తాను. 29 ఏళ్లుగా బోధనా రంగంలో పని చేస్తున్నాను. అన్ని విభాగాల్లో బాగా పని చేసిన అనుభవం ఉంది. అన్ని అంశాలపై సమగ్రమైన అవగాహన ఉంది. వర్సిటీ అభివృద్ధికి తనవంతు సేవలు అందిస్తాను.
-జీఎన్ శ్రీనివాస్, పీయూ ఉపకులపతి

ఆన్‌లైన్‌లో మార్కుల నమోదు ప్రక్రియ నత్తనడక

ఎఫ్‌ఏ-1 మార్కుల నమోదు : 78 శాతం
ఎఫ్‌ఏ-2 మార్కుల నమోదు : 45 శాతం

అచ్చంపేట, న్యూస్‌టుడే : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఇప్పటి వరకు నిర్వహించిన రెండు నిర్మాణాత్మక మూల్యాంకనం మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 21 నుంచి సంగ్రహణాత్మక మూల్యాంకనం సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ)-1 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జులైలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ)-1, సెప్టెంబరులో ఎఫ్‌ఏ-2 పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఎఫ్‌ఏ-1 పరీక్షలు ముగిసి మూడు నెలలు కావస్తున్నా మార్కుల నమోదు ప్రక్రియ పూర్తి కాలేదు. ఇప్పటి వరకు 78 శాతం నమోదు పూర్తి కాగా ఇంకా 22 శాతం పెండింగ్‌లో ఉంది. సెప్టెంబరు నెలాఖరులో నిర్వహించిన ఎఫ్‌ఏ-2 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కుల నమోదు ప్రక్రియ ఇంకా వేగం పుంజుకోలేదు. ఇప్పటి వరకు ఎఫ్‌ఏ-2 మార్కుల నమోదు ప్రక్రియ 45 శాతం పూర్తి చేశారు. ఇంకా 55 శాతం మంది విద్యార్థుల మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. వెంటనే మార్కుల ఆన్‌లైన్ నమోదును పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశిస్తున్నారు.


కొండనాగుల జడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

జిల్లాలోని మొత్తం పాఠశాలలు 1,102	మొత్తం విద్యార్థులు 1,17,790
ఎఫ్‌ఏ-1 మార్కుల నమోదు 91,826 (77.96 శాతం)	ఎఫ్‌ఏ-2 మార్కుల నమోదు 52,492 (44.56 శాతం)

● అన్ని పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా ఇప్పటికే ఎంఈవోలు, సముదాయ పాఠశాలల హెచ్‌ఎంలకు ఆదేశాలిచ్చాం. ఈ నెల 21 నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు ఉన్నందున ఆ లోగా ఎఫ్‌ఏ-1, ఎఫ్‌ఏ-2 మార్కుల వివరాల నమోదు పూర్తి చేస్తామని డీఈవో డా.గోవిందరాజులు పేర్కొన్నారు.

మొదటి స్థానంలో అచ్చంపేట : జిల్లాలోని 20 మండలాల్లో ఇప్పటి వరకు విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియలో అచ్చంపేట మండలం ముందంజలో ఉంది. మొత్తం 90 పాఠశాలల్లో 14,357 మంది విద్యార్థులు చదువుతుండగా ఎఫ్‌ఏ-1లో 12,168 మంది విద్యార్థులు, ఎఫ్‌ఏ-2లో 11,204 మంది విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మార్కుల నమోదులో అమ్రాబాద్ మండలం పూర్తిగా వెనుకబడి ఉంది. ఈ మండలంలోని 65 పాఠశాలల్లో 4,119 మంది విద్యార్థులు ఉండగా ఎఫ్‌ఏ-1లో 2,509 మంది విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఎఫ్‌ఏ-2లో ఇప్పటి వరకు కేవలం 527 మంది విద్యార్థుల మార్కులను మాత్రమే నమోదు చేశారు. ఎఫ్‌ఏ-2లో 20 శాతంలోపు లాన్‌లైన్‌లో మార్కులను ఆన్‌లైన్ చేసిన మండలాలు మూడు ఉన్నాయి. జిల్లాలో 50 శాతం కన్నా తక్కువ నమోదు చేసిన మండలాలు 11 ఉండగా, 50 శాతానికన్నా అధికంగా నమోదు చేసిన మండలాలు ఆరు ఉన్నాయి. అతి తక్కువగా నమోదు ప్రక్రియ చేపట్టిన మండలాల్లో లింగాల 18.18 శాతం, పెంట్లవెల్లి 19.07 శాతంతో వెనుకబడి ఉన్నాయి. అధికంగా మార్కుల నమోదు చేసిన మండలాల్లో తిమ్మాజిపేట 71.08 శాతం, ఉప్పునుంతల మండలం 64.19 శాతంతో రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.

కాంగ్రెస్‌ది ప్రజాపాలన ప్రభుత్వం

మంత్రి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వేదికపై నీలి శ్రీనివాసులు, సంపత్‌కుమార్, సరిత తదితరులు

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణలో నిరంకుశత్వం, నియంతృత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం గద్వాలలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణతో పాటు కృష్ణవేణి చౌక్‌లో ఏర్పాటుచేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నీలి శ్రీనివాసులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు కలెక్టరేట్ కార్యాలయం నుంచి కృష్ణవేణి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.2లక్షలపైన ఉన్న రైతులకు రూ.2 లక్షల వరకు మాఫీ చేయాల్సి ఉందని అది కూడా చేస్తామన్నారు. ఐదేళ్లలో రూ.లక్ష మాఫీ చేయని వాళ్లకు రుణమాఫీ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. త్వరలోనే నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ప్రకటిస్తామని వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలదేనని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు జిల్లా వారే కావడంతో ఇక్కడి రైతులను దృష్టిలో ఉంచుకుని జూరాల, నెట్టెంపాడు, తుమ్మిళ్ల, గట్టు ఎత్తిపోతల పథకాలు పూర్తిచేస్తారన్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరితలు మాట్లాడుతూ ఒక బీసీ బిడ్డ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్, పుర ఛైర్మన్ బీఎస్ కేశవ్, టీపీసీసీ సభ్యుడు శంకర్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నల్లారెడ్డి, నాయకులు ఇసాక్, షెక్షావలి, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గైర్హాజరు..: ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గైర్హాజరవటం చర్చనీయాంశంగా మారింది. కాగా ఎమ్మెల్యేతో పాటు మరో ఇద్దరు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు హాజరు కావాల్సి ఉండగా వారు రాకపోవడంపైనా చర్చించుకోవడం కన్పించింది.

33 కేంద్రాల్లో గ్రూప్ 3 పరీక్షలు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : జిల్లాలో 33 కేంద్రాల్లో గ్రూప్ 3 పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పరీక్షల నిర్వహణకు పరీక్షా కేంద్రాలను గుర్తించామని జిల్లాలో 9,792 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు చెప్పారు. నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించనున్న ఈ పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సీతారామారావు, దేవసహాయం, అదనపు ఎస్పీ రామేశ్వర్ పాల్గొన్నారు.

ఆర్టీసీకి దసరా బొనాంజా

16 రోజుల్లో రూ.39.22 కోట్ల ఆదాయం


ఆర్టీసీ ఆదాయ వివరాలు వెల్లడిస్తున్న ఆర్ఎం వి.శ్రీదేవి

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్టీసీకి దసరా పండగ సందర్భంగా ఆశించిన స్థాయిలో ఆదాయం వచ్చినట్లు ఆర్ఎం వి.శ్రీదేవి వెల్లడించారు. శుక్రవారం ఆమె తన ఛాంబర్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 16 రోజుల పాటు ఆర్టీసీకి వివిధ డిపోల వారిగా ప్రయాణికుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని వివరించారు. అక్టోబర్ 1 నుంచి 16 వరకు ఉమ్మడి జిల్లా (రీజియన్) వ్యాప్తంగా 740 బస్సులను వివిధ రూట్లలో 52.72 లక్షల కిలోమీటర్లు నడిపి 69.83 లక్షల మంది ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా ఆర్టీసీ సంస్థకు రూ.39.22 కోట్ల రాబడి వచ్చిందని ఆర్ఎం తెలిపారు. ఇందులో రూ.4.73 కోట్లు టోల్‌ప్లాజా, సెస్, ఇతర వస్తువుల రవాణా ద్వారా, మరో రూ.34.49 కోట్లు ప్రయాణికుల ద్వారా సమకూరిందని వివరించారు. ఈ ఆదాయం ఆర్టీసీకి రీజియన్‌లోనే సరికొత్త రికార్డు అన్నారు. 14వ తేదీ ఒక్క రోజే 138 శాతం ఆక్యుపెన్సీతో రీజియన్‌లో ఆర్టీసీకి రూ.3.33 కోట్ల ఆదాయం వచ్చిందని, ఇది కూడా ఆర్టీసీ చరిత్రలో ఆల్‌టైం రికార్డు అన్నారు. పండగ సందర్భంగా రాష్ట్ర స్థాయిలోనూ మహబూబ్‌నగర్ రీజియన్ 110 శాతం ఆక్యుపెన్సీ సాధించి అగ్రస్థానంలో నిలిచిందని ఆర్ఎం తెలిపారు.

వివిధ డిపోల వారిగా వచ్చిన ఆదాయం ఇలా

డిపో పేరు	కి.మీలు (లక్షల్లో)	ఆదాయం (రూ.లక్షల్లో)
అచ్చంపేట	4.92	315.88
గద్వాల	6.26	415.04
కల్వకుర్తి	6.16	388.36
కొల్లాపూర్	4.21	265.27
కోస్గి	0.73	42.44
మహబూబ్‌నగర్	8.00	519.55
నాగర్‌కర్నూల్	5.06	353.98
నారాయణపేట	5.54	347.10
షాద్‌నగర్	4.83	316.55
వనపర్తి	7.01	485.28
మొత్తం	52.72	3449.45

అండర్-23 ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక


అండర్-23 ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికైన క్రికెట్ జట్లతో ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఈనెల 21వ తేదీ నుంచి జరిగే ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ పోటీలకు జిల్లా క్రికెట్ సంఘం శుక్రవారం ఆరు జట్లను ఎంపిక చేసింది. 28వ తేదీ వరకు ఈ ఆరు జట్ల మధ్య క్రికెట్ పోటీలు ఉంటాయని, ఈ పోటీల్లో ప్రతిభా చాటిన క్రీడాకారులను గుర్తించి ఉమ్మడి జిల్లా అండర్-23 జట్టును ఎంపిక చేస్తామని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎం.రాజశేఖర్ తెలిపారు. నవంబర్ 4 నుంచి వరంగల్, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ఉంటాయని, ఈ పోటీల్లో ప్రతిభ చాటిన వారిని రంజీ జట్టుకు ఎంపిక చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షులు సురేష్, అశోక్, కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

వేడుక మాటున వేదన



న్యూస్‌టుడే- కోస్గి, పాతబస్టాండ్(నారాయణపేట)

డీజే శబ్దాలు మరణ శాసనాలుగా మారుతున్నాయి. అతి భయంకర ధ్వనులు చెవులను దెబ్బతీస్తున్నాయి. పలువురు యువకులు వాటి ముందు ఎక్కువ సమయం నృత్యాలు చేయడంతో చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండా డీజేల పట్ల ఆకర్షితులవుతున్నారు. శ్రుతిమించిన ధ్వనులతో ఇబ్బందుల పాలౌతున్నారు.


నారాయణపేటలో డీజే శబ్దాల మధ్య నృత్యాలు చేస్తున్న యువకులు

మీకు తెలుసా..?

● మహారాష్ట్రలోని గాంధీ చౌక్ వద్ద జరిగిన ఓ ఉత్సవంలో ఎక్కువ సంఖ్యలో డీజేలను ఏర్పాటు చేశారు. వాటి శబ్ద ప్రభావంతో 250 మంది చెవిపోటుకు లోనయ్యారు. వీరిలో చాలా మందికి చెవుడు వచ్చింది.

● వనపర్తి జిల్లా అమరచింత మండలం మిట్టనందిమల్ల గ్రామంలో 28 ఏళ్ల యువకుడు దసరా ఉత్సవాల శోభాయాత్రలో డీజే శబ్దాల మధ్య నృత్యాలు చేశాడు. ఇంటికి వచ్చి గుండెపోటుకు గురై మృతి చెందాడు.

● **ధరూర్:** రేవులపల్లిలో ఇటీవల డీజే శబ్దాల మధ్య బతుకమ్మలను ఊరేగిస్తుండగా సౌండ్ తగ్గించాలని ఓ వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. అతనితో ఊరేగింపు నిర్వాహకులు గొడవపడ్డారు. వారించడానికి వచ్చిన ఆర్మీ జవాన్‌ను కత్తితో పొడిచారు.

చెవులు చిల్లులు

బ్లూటూత్, రిమోట్ వంటి పరికరాలతో డీజేలను నియంత్రించే పద్ధతి రావడంతో శబ్ద కాలుష్యంతోపాటు రేడియేషన్ ప్రభావం ఉంటోంది. మానసిక సమస్యలు, వ్యాకులత కూడా కలుగుతున్నాయి.

శబ్ద తీవ్రతను డెసిబుల్స్‌లో కొలుస్తారు. డెబ్బై డెసిబుల్స్ తీవ్రత ఉన్న శబ్దాలను చెవులు తట్టుకోగలుగుతాయి. ఆపై పెరిగితే ప్రమాదం తప్పదు. 80 నుంచి 100 డెసిబుల్స్ మధ్య చెవుడు వచ్చే ప్రమాదం ఉంది. వంద నుంచి 120 డెసిబుల్స్ మధ్య రక్తపోటు పెరిగి గుండె లయ తప్పి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. మనుషులే కాదు పశుపక్ష్యాదులపై ధ్వని ప్రభావం చూపుతుంది.

మన జిల్లాలో వినాయక, బతుకమ్మ, దుర్గామాత ఉత్సవాల్లో సౌండ్‌బాక్స్‌లను పెద్దఎత్తున వినియోగిస్తున్నారు. పల్లెల్లోనూ కొంతమంది డీజేలను కొనుగోలు చేసి అద్దెలకు ఇస్తున్నారు. ప్రాంతం బట్టి, ఉపకరణం స్థాయిని అనుసరించి రూ. 20 నుంచి రూ. 80 వేలు వరకు వసూలు చేస్తున్నారు.

మనం ఏం చేయాలి?



● చిన్న శబ్దంతో డీజేలు వాడుకుంటే ఇబ్బంది ఉండదన్న విషయాన్ని యువతకు అవగాహన కల్పించాలి.

● చిన్న పిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మన సరదా కోసం ఎదుటివారి జీవన హక్కును దెబ్బతీసినట్లేనని గుర్తించాలి. అర్ధరాత్రి మోతమోగిస్తే ఎక్కువమందికి నిద్రా భంగం కలుగుతుంది.

● ఉమ్మడి జిల్లాలో పోలీసులు డీజే శబ్దాలపై ప్రకటనలు చేస్తున్నా, వాస్తవానికి పట్టించుకోలేదు. కొన్ని చోట్లయితే ఎవరైతే ఫిర్యాదు చేస్తారో వారిపేరును నిర్వాహకులకు చెప్పిన సందర్భాలు ఉన్నాయి.

నిబంధన అమల్లో ఉంది



హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో డీజేలపై నిషేధం ఇప్పటికే అమల్లో ఉంది. పోలీసులు ఎంతచెప్పినా పౌరసమాజం, ప్రజాసంఘాలు కలిగించుకుంటే తప్ప సమస్య పరిష్కారం కాదు. డీజేల నిర్వాహకులతో కమిటీ ఏర్పాటు చేసి శబ్దకాలుష్యం వల్ల అనర్థాలపై అవగాహన కల్పిస్తాం. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

- నల్లపు లింగయ్య, డీఎస్పీ, నారాయణపేట

చెవుడు వచ్చే ప్రమాదం



ఎక్కువ శబ్దం, ఎక్కువ సేపు వింటే తరంగాలు చెవుల్లో మోత మోగించడంతోపాటు కర్ణభేరి దెబ్బతింటుంది. వినికిడి సమస్యలు తలెత్తుతాయి. మానసిక ఒత్తిడి, వ్యాకులత పెరుగుతుంది. ఇది మానసిక సమస్యలకు దారితీస్తుంది. చెవుడు వంటి సమస్యలతో పాటు, గుండె పోటుకు ఆస్కారం ఉంటుంది. హృదయ సమస్యలు ఉన్నవారు ఎక్కువ శబ్దాలను వినలేరు. వారిని దృష్టిలో ఉంచుకోవాలి. మెదడు దెబ్బతినే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వీలైనంత వరకు తక్కువ శబ్దాలతో, ప్రశాంతమైన వాతావరణంలో వేడుకలు చేస్తే మంచిది.

- డా.శ్రీనివాస్, ఈఎన్‌టీ వైద్యుడు.

292 సెక్షన్ బీఎన్ఎస్ కింద శిక్షార్హులు



పరిమితికి మించిన శబ్దకాలుష్యంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సెక్షన్ 292 బీఎన్ఎస్ కింద శిక్షార్హులవుతారు. వాణిజ్య ప్రాంతాలు, జనసంచారం ఉండే నివేశాల్లో ఉదయం, రాత్రి వేళల్లో నిబంధనలకు లోబడి శబ్దం ఉండాలి. పరిమితికి మించి శబ్దం పెంచితే రూ.200 నుంచి రూ.2వేల వరకు కోర్టు జరిమానా విధించే అవకాశం ఉంది. ప్రజాజీవనానికి భంగం కల్గిస్తే మరికొన్ని తీవ్ర శిక్షలు, సెక్షన్లు వర్తిస్తాయి.

- కె.రాజశేఖర్, న్యాయవాది నారాయణపేట

చెల్లియో చెల్లక

న్యూస్‌టుడే- ఊట్కూరు, పాలమూరు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో పదిరూపాయల నాణేలు తీసుకోవడం లేదనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకర్లు ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ● ప్రయాణికులు ఇచ్చే రూ. 10 నాణేలను తీసుకోవాలని ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లను ఆ సంస్థ యాజమాన్యం ఆదేశించింది. ఫిర్యాదు నేపథ్యంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కార్యదర్శి గత నెల 29న ఆయా డిపో మేనేజర్లకు ఆదేశాలను జారీ చేశారు. ● మక్తల్ పట్టణంలోని కొన్ని పెట్రోలు బంకుల్లో కూడా రూ. 10, రూ.20 నాణేలను తీసుకోవటం లేదని వినియోగదారులు వాపోతున్నారు. అవగాహన రాహిత్యం వల్ల కొంత మంది ప్రజలు కూడా తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు.




మహబూబ్‌నగర్‌లో దుకాణదారులకు రూ.10 నాణెంపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

అసలేం జరిగింది

పెద్దనోట్ల రద్దు నిర్ణయం తీసుకున్న తర్వాత రూ.1000, రూ.500 రద్దు చేసి వాటి స్థానంలో కొత్త రూ.2వేలు, రూ.500 విడుదల చేశారు. పెద్దనోట్ల రద్దు అనంతరం ఎక్కువ మొత్తంలో చిల్లర సమస్య ఉత్పన్నమైంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు పది రూపాయల నాణేన్ని చెలామణిలోకి తీసుకొచ్చారు. బ్యాంకు ఖాతాల నుంచి నగదు ఉపసంహరించినప్పుడు ఎక్కువ మొత్తంలో నాణేలను ఖాతాదారులకు ఇచ్చారు. ఈ బరువు మాకెందుకని చాలామంది బయట ఎవరూ తీసుకోవడం లేదనే వదంతులు లేపారు.

బ్యాంకుల్లో రూ.16 కోట్ల నాణెలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ. 16 కోట్ల విలువైన రూ.10 నాణేలు ఉన్నాయి. పలు ప్రైవేటు, అనుబంధ సంస్థల బ్యాంకులలో మరో రూ. 10 కోట్ల నాణేలు ఉన్నట్లు బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎస్‌బీఐ బ్యాంకుల్లో రూ.2.5 కోట్ల రూ.10 నాణెలు, యూనియన్ బ్యాంక్‌ల్లో రూ. 2కోట్లు నాణేలు ఉన్నట్లు ఆ వర్గాల సమాచారం.

అవగాహన విస్తృతం చేయాలి



మా దుకాణానికి సరకుల కోసం వచ్చే కొంత మందికి రూ. 10 నాణెం ఇస్తే తీసుకోవటం లేదు. ఎంత చెప్పినా ససేమిరా అంటున్నారు. కొంత మంది తీసుకెళ్లి, ఎవ్వరూ తమవద్ద తీసుకోకపోతే తిరిగి ఇస్తున్నారు. ప్రజల్లో అపోహలు తొలగిపోవాలంటే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలి. ఈ మధ్య ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు పెడుతున్నారు. అందులో ఈ విషయం చెప్పాలి. షీటీంలు, ఇతరశాఖల అవగాహన సదస్సుల్లో ఇదో అంశంగా చేస్తే బాగుంటుంది.

- ఎస్.మధుకర్, కిరాణా దుకాణదారుడు, ఊట్కూరు.

నిరాకరిస్తే ఫిర్యాదు చేయండి



దుకాణదారులైనా, వ్యాపార సంస్థలైనా, వ్యక్తులైనా రూ. 10, రూ. 20 నాణేలను తీసుకునేందుకు నిరాకరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు దగ్గరలోని పోలీసు స్టేషన్‌లోనో, లేదా ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చు. అందరం కలిసి అసత్య ప్రచారాలను ఆపుదాం.

- కాల్వ భాస్కర్, లీడ్ బ్యాంకు మేనేజర్, మహబూబ్‌నగర్.

'పాలమూరు'పై సీఎంకు చిత్తశుద్ధి ఏదీ?: నాగం


నాగర్‌కర్నూల్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి డా. నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసి నార్లపూర్, వట్టెం, కర్వెన జలాశయాలను నీటితో నింపాలని మాజీ మంత్రి డా. నాగం జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై చిత్తశుద్ధి లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి దాదాపు 9 నెలలు దాటినా కొల్లాపూర్ మండలంలోని కుడికిళ్ల వద్ద పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన మూడున్నర కిలో మీటర్ల సొరంగం పనులు పూర్తి చేయలేదని విమర్శించారు. ప్రస్తుత వర్షాకాలం ముగిసే వరకు పనులు త్వరగా పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలన్నారు. లేని పక్షంలో డిసెంబర్ 9న కూడికిళ్ల వద్ద నిరసన దీక్ష చేపడుతామని హెచ్చరించారు. అకాల వర్షాలతో పత్తి సాగు నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. పంట నష్టపరిహార నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి పంపించాలన్నారు. సీసీఐ కేంద్రాలను ప్రారంభించి పత్తి కొనుగోలు చేయాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ, హైడ్రా పరిపాలన బందు చేసి ప్రజా పరిపాలనపై దృష్టి సారించాలన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టు పరిధిలోని కాల్వల ద్వారా 5 వేల క్యూసెక్కుల నీరు వెళ్లేలా వెడల్పు చేయాలన్నారు. జిల్లాలోని మంత్రి, ఎమ్మెల్యేలు స్పందించి పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ప్రాజెక్టు పరిధిలోని పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయించడానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు డా. నాగం శశిధర్‌రెడ్డి, అర్థం రవి, తిమ్మాజిపేట పాండు, బాలగౌడ్, ఐతోలు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు ప్రభావంతో రైతు మృతి

మల్దకల్, న్యూస్‌టుడే: పత్తి పొలానికి పురుగు మందు పిచికారీ చేసిన రైతు తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందిన ఘటన మల్దకల్‌లో చోటు చేసుకుంది. ఏఎస్సై ఈశ్వరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు మంగళి ఆంజనేయులు(46) గురువారం తన పత్తిపొలానికి క్రిమిసంహారక మందు పిచికారీ చేశాడు. దీంతో రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు చికిత్సకు కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందినట్లు తెలిపారు. ఆంజనేయులుకు భార్య సరస్వతి, ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై వివరించారు.

బస్సు ఢీకొని ఒకరి దుర్మరణం


శైలేష్

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వెన్నచర్ల, రాయిపాకుల దారిలో శుక్రవారం ఉదయం బస్సు, బైకు ఢీకొన్న ఘటనలో వెన్నచర్లకు చెందిన సంపంగి హన్మంతు చిన్నకుమారుడు సంపంగి శైలేష్ (18) మృతిచెందాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. వెన్నచర్ల నుంచి ద్విచక్రవాహనంపై వెళ్తున్న శైలేష్ బండరాయిపాకుల సమీపంలో బస్సును అధిగమించబోయి ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన యువకుడిని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

పిడుగు పాటుకు కూలీ...


సంగమ్మ

మరికల్ కూడలి : పిడుగు పడి ఓ వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన మరికల్ మండలం కన్మనూర్ గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. మరో ఇద్దరు మహిళలు అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్థుల కథనం ప్రకారం... శేర్నపల్లి గ్రామానికి చెందిన రైతు కన్మనూర్ శివారులో కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. కర్నాటక రాష్ట్రంలోని గురిమిట్కల్ తాలుకా పరిధిలోని అన్వూర్ గ్రామానికి చెందిన మహిళలను పత్తి తీసేందుకు శుక్రవారం తీసుకొచ్చాడు. మధ్యాహ్నం వర్షం పడడంతో వారు ఓ చెట్టు కిందకు చేరారు. ఆ సమయంలో పిడుగు పడగా బోయ సంగమ్మ(45) అనే మహిళ అక్కడిక్కడే మృతి చెందారు. మల్లమ్మ, అల్లమ్మ అనే మహిళలకు గాయాలై అస్వస్థతకు గురయ్యారు. అయితే పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే కూలీలను తీసుకొచ్చిన వాహనంలోనే మృతదేహం, గాయపడిన వారిని తరలించారు.

బాలిక హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు

సదాశివపేట: బాలిక హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదుతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సెషన్ జడ్జి జి.భవానీచంద్ర శుక్రవారం తీర్పు ఇచ్చారు. సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపిన ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం ఇబ్రహింపల్లికి చెందిన వీరేశం భార్య కల్పన మూడేళ్ల కూతురు భవ్యతో కలిసి గతంలో ప్రసవానికి షాబాద్ మండలం బోడపహాడ్ పుట్టింటికి వెళ్లింది. అక్కడ రాజుతో పరిచయం ఏర్పడి అక్కడే ఉండిపోయింది. కాన్పు అనంతరం చిన్నకూతురు, పెద్ద కూతురు భవ్య, ప్రియుడితో కలిసి సదాశివపేట పట్టణం ప్రియదర్శిని కాలనీకి మకాం మార్చారు. భవ్య తనను నాన్న అని పిలవడంలేదని రాజు ఆగ్రహంతో చిన్నారిని గోడకు కొట్టడంతో మృతి చెందింది. ఈ ఘటన 26 ఫిబ్రవరి 2019లో జరిగింది. ఈ విషయం తండ్రి వీరేశానికి తెలియడంతో కూతురు మరణంపై అనుమానం ఉందని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ.. కల్పన, రాజుపై కేసు నమోదు చేసి విచారించగా, నిందితులు నేరం అంగీకరించడంతో వారిని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం కేసు విచారణకు వచ్చింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చారని వివరించారు.

పీయూలో సౌత్‌జోన్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పాలమూరు, న్యూస్‌టుడే: పాలమూరు విశ్వవిద్యాలయంలో సౌత్‌జోన్ పోటీల కోసం ఎంపికలను నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పీయూలో బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను పురుషుల విభాగంలో నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీరాములు (కొల్లాపూర్), జగదీశ్ (నారాయణపేట), బడేసాబ్ (మహబూబ్‌నగర్), శివకృష్ణ (నారాయణపేట), రాకేశ్ (మహబూబ్‌నగర్) తదితర క్రీడాకారులను ఎంపిక చేసినట్లు పీడీ శ్రీనివాసులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వ విద్యాలయంలో నిర్వహించే సౌత్ జోన్ క్రీడల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పీడీలు సత్య భాస్కర్, వెంకట్‌రెడ్డి, శారద, నరేశ్, మన్యం పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో నైపుణ్యం వెలికితీతకే సీఎం కప్



సీఎం కప్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు సీఎం కప్ మంచి వేదిక అని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం సీఎం కప్ టార్చ్ ర్యాలీకి కలెక్టర్ స్వాగతం పలికారు. పట్టణంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ కొనసాగింది. ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌తో పాటు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువత క్రీడా సాధనతో శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

రాయచోటి, సుండుపల్లి, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలం పెద్దినేనికాలువ గ్రామం బెస్తపల్లిలో నివాసం ఉన్న వివాహిత లక్ష్మి(25) శుక్రవారం ఇంటిలో పెట్రోలు పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఘటనలో తీవ్ర గాయాలైన ఆమెను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన లక్ష్మి పరిస్థితి విషమంగా ఉండడంతో సమాచారం అందుకున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి అసిఫా సుల్తానా ఆసుపత్రికి వచ్చి వాంగ్మూలం తీసుకున్నారు. ఎస్సై శ్రీనివాసులు విచారించి కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన గోవిందు. లక్ష్మిల దంపతులు రెండేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం ఇక్కడికి వచ్చారు. సుండుపల్లి మండల పరిధిలోని రాళ్లుకొట్టే పనులు చేస్తూ బెస్తపల్లెలో అద్దె ఇంటిలో నివాసముంటున్నారు. వీరికి మూడేళ్లు, పదినెలల వయసున్న ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఘటన గురించి తెలుసుకున్న రాయచోటి గ్రామీణ సీఐ వరప్రసాద్, సుండుపల్లి ఎస్సై శ్రీనివాసులు ఆసుపత్రికి వెళ్లి విచారించారు. లక్ష్మిపరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

మేమున్నాం.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు
మీకు తోడుగా..

నాగర్‌కర్నూలు	7993300530
అచ్చంపేట	8008573927
కల్వకుర్తి	9908803650
కొల్లాపూర్	8008573870

? నాగరకర్నూల్ : మధురానగర్ కాలనీలో ఇళ్ల మధ్య మురుగు నిల్వగా మారింది. పాపయ్యనగర్ కాలనీలో కొన్ని రోజులుగా మురుగుకాల్వలు శుభ్రం చేయడం లేదు.
– శ్రీను, నరేశ్, నాగర్‌కర్నూల్

✔ మధురానగర్ కాలనీలో మురుగుకాల్వలు నిర్మిస్తాం. పాపయ్యనగర్‌లో పురపాలక పారిశుద్ధ్య సిబ్బందిని పంపి వెంటనే కాల్వలు శుభ్రం చేయిస్తాం.
– నరేశ్‌బాబు, పురపాలక సంఘం కమిషనర్

– న్యూస్‌టుడే, కందనూలు

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో.. రవి : **దేవర**, రమణ : **వేట్టయన్ ద హంటర్, కల్వకుర్తిలో**..పార్థసారథి : **దేవర**, అశోక్ : **వేట్టయన్ ద హంటర్**

బడి ఆవరణలో కానరాని స్వచ్ఛత


నాగర్‌కర్నూల్ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మురుగు

కందనూలు, న్యూస్‌టుడే : కురుస్తున్న అకాల వర్షాలకు పాఠశాలల ఆవరణలు అపరిశుభ్రంగా మారడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేక కార్యక్రమాల పేరిట హడావుడి చేసే అధికారులు ఆ తర్వాత స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. జిల్లా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

● జిల్లాలో మొత్తం 816 ప్రభుత్వ పాఠశాలల ఉన్నాయి. వీటి పరిధిలో 65 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. గత భారాస ప్రభుత్వ పాలన కాలంలో పాఠశాలలో కొనసాగుతున్న స్కావెంజర్లు, పారిశుద్ధ్య కార్మికులను తొలగించి గ్రామాల్లో గ్రామపంచాయతీ, పట్టణాల్లో పురపాలక శాఖ కార్మికులకు బాధ్యతలు అప్పగించారు. వారు సక్రమంగా శుభ్రం చేయడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలల ఆవరణాలు పరిశుభ్రంగా మారడంతో పాటు స్కావెంజర్ల లేకపోవడం వలన మూత్రశాలలు, అపరిశుభ్రంగా మారాయి. ప్రస్తుత వర్షాకాలంలో దోమల బెడద పెరిగి విద్యార్థులు జ్వరం, మలేరియా, డెంగీ తదితర వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని 26 పాఠశాలల్లో మూత్రశాలలు లేకపోవడం వలన విద్యార్థులు ఆరుబయట మూత్రవిసర్జన చేస్తున్నారు. పాఠశాల ఆవరణలు అపరిశుభ్రంగా ఉండటం వలన విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఉపాధ్యాయులను నియమించిన మాదిరిగానే పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను, స్కావెంజర్లను నియమించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

● నాగర్‌కర్నూల్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 250 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంది. విద్యార్థులు ఆటలు ఆడుకోవడానికి, ఉపాధ్యాయులు ప్రార్థన చేయించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● ఊర్కొండపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 145 మంది చదువుతున్నారు. ఈ పాఠశాలలో గుత్తేదారు మూత్రశాలలను అసంపూర్తిగా నిర్మించి వదిలేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు విద్యార్థులు ఆరు బయట మూత్రవిసర్జనకు వెళ్తున్నారు.

చర్యలు తీసుకుంటాం : పాఠశాలల పరిసరాలు, తరగతి గదులు శుభ్రం చేసే బాధ్యత పంచాయతీ కార్మికులకు అప్పగించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోయాం. విద్యార్థులకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకుంటాం. **– గోవిందరాజులు, జిల్లా విద్యాశాఖ అధికారి**

అడుగుకో గుంత.. తీరేనా చింత



వంగూరు, చారకొండ రెండు మండలాలను కలిపే రోడ్డు 20 ఏళ్ల నుంచి మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఏళ్లగా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోక పోవడంతో రోడ్డంతా గుంతలు మారాయి. చినుకులు పడితే చాలు బురదమయంగా మారి కనీసం కాలినడకన వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. 12 ఏళ్ల కిందట ఈ రోడ్డుపై మట్టిపోయించారు. తర్వాత కనీస మరమ్మతులు సైతం చేపట్టడం లేదు. వంగూరు స్టేజీ నుంచి చారకొండ మండలం జూపల్లి వరకు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న రోడ్డులో అడుగుకో గుంత ఉంది. పంచాయతీరాజ్ శాఖ ఏఈ మణిపాల్ రాథోడ్‌ను సంప్రదించగా.. రూ.9కోట్లు మంజూరయ్యాయని టెండరు అయిన వెంటనే రెండు వరసల తారురోడ్డు పనులు ప్రారంభిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, వంగూరు

కూరగాయల ధరలు కిలో.. రూ.లలో



కందనూలు, న్యూస్‌టుడే : టమాటా 70, వంకాయ 40, బెండ 45, మిరప 60, కాకర 65, బీర 60, క్యాలీఫ్లవర్ 75, క్యాబేజీ 48, క్యారెట్ 65, దొండ 50, ఆలుగడ్డ 48, గోకర 65, దోస 44, ఆనంకాయ 18, చిక్కుడు 60, మునగకాయ 70, బీట్‌రూట్ 50, ఖీర, 40, బీన్స్ 90

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

కందనూలు, న్యూస్‌టుడే : జిల్లాలోని పెంట్లవెల్లి మండలంలోని ఓ జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పాఠశాలకు హాజరు కాకుండా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా.. చర్యలు తీసుకోవడం లేదని రాష్ట్ర గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ కార్యదర్శి భరత్ ఆరోపించారు. ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో గోవిందరాజులకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఉన్నతాధికారులు స్పందించి ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అచ్చంపేట న్యూటౌన్ : నిరుద్యోగ యువత నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ కోరారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్ ఐ.టి.ఐ. కళాశాలలో ఏర్పాటు చేయనున్న శిక్షణా కేంద్రంలో ఆరు నూతన కోర్సులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసిన యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పొందిన యువతకు వివిధసంస్థలలో ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు భరోసానిచ్చారు.

సంక్షేమ పథకాలతో పేదలకు మనోధైర్యం

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు మనోధైర్యం లభిస్తుందని ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ ప్రజాభవన్‌లో 241 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 100 మందికి సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాజేందర్, ఆర్డీవో మాధవి, తహసీల్దారు శైలేంద్రకుమార్, నేతలు గోపాల్‌రెడ్డి, రామనాథం, నర్సయ్య యాదవ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

ఉప్పునుంతల, న్యూస్‌టుడే : మండలంలోని పిరట్వాన్‌పల్లి తండాలో తుల్జాభవాని, మేరమ్మ భవానీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు గణపతి పూజ అనంతరం అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ పాల్గొని మాట్లాడారు. తండా అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కట్టా అనంతరెడ్డి, రంగారెడ్డి, టి.నర్సింహరెడ్డి, నర్సింహరావు, ఛత్రునాయక్, హతీరాంబావాజీ, భారతి, ఘాన్సీరాం, పత్యానాయక్ పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌కు ఉత్తమ పరిశోధన పత్రం అవార్డు


అవార్డు అందుకున్న ప్రిన్సిపల్ ఎబినేజర్

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే : పోలేపల్లి సెజ్‌లోని ఎస్వీకేఎం పాఠశాల ప్రిన్సిపల్ డా.బి.ఎబినేజర్‌కు జాతీయ స్థాయిలో ఉత్తమ పరిశోధన పత్రం అవార్డు వచ్చినట్లు శుక్రవారం ఆయన తెలిపారు. రెండు రోజులుగా మధురైలో జరుగుతున్న సీబీఎస్‌ఈ జాతీయ ఉపాధ్యాయ సమావేశంలో ఆయన హాజరయ్యారు. ఆయన ది ఆర్ట్ అటాక్, ఆర్ట్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ద్వారా మానసిక శ్రేయస్సు కోసం సమగ్ర దృక్పథం అనే అంశంపై పరిశోధన పత్రం అందజేసి వివరించారు. ఇందుకు గాను అవార్డు అందుకున్నట్లు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రిలో కలెక్టర్ తల్లికి వైద్య పరీక్షలు

పాలమూరు, న్యూస్‌టుడే: కలెక్టర్ విజయేందిర బోయి తల్లి హైమావతి (86)కి ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎక్స్‌రే, ఇతర స్కానింగ్ సేవలతో పాటు, ఈఎన్‌టీ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆమెకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్‌తో పాటు, ఆర్థో, రేడియాలజీ విభాగ ఆచార్యులు వైద్య సేవలందించారు. అనంతరం రిపోర్టుల ఆధారంగా వైద్యులు ఆమెకు ఆరోగ్య సూచనలను అందించారు. కార్యక్రమంలో రేడియాలజీ విభాగ ఆచార్యులు డా. హన్మత్‌ప్రసాద్, ఆర్థో విభాగాధిపతి రవీందర్ గౌడ్, సహాయ ఆచార్యులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వలకు గండ్లు పెడితే చట్టరీత్యా చర్యలు

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే: కేఎల్ఐ డి-82 ప్రధాన కాల్వలకు గండ్లు పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. అనుమతులు లేకుండా అక్రమంగా గ్రామాల్లో చెరువులు, కుంటలు, వ్యక్తిగత అవసరాల కోసం కాల్వకు గండ్లు పెడుతున్నారన్నారు. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, ప్రాణాధారమైన సాగునీటి వృథా వంటి చర్యలకు ఎంతమాత్రం పాల్పడవద్దన్నారు. సంబంధిత నీటి పారుదల శాఖ అధికారుల అనుమతి తీసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

విద్యుత్తు ఉద్యోగులకు బదిలీలు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : జిల్లాలో విద్యుత్తు శాఖలో శుక్రవారం ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారం రోజులుగా డీఈ కార్యాలయంలో బదిలీలపై విద్యుత్తు శాఖలో ఉన్న యూనియన్లతో చర్చలు జరుగుతున్నాయి. వారం రోజుల క్రితమే బదిలీలు కావాల్సి ఉంది. ఎట్టకేలకు శుక్రవారం బదిలీలు చేస్తూ డీఈ శ్రీధర్‌శెట్టి ఉత్తర్వులు ఇచ్చారు. 67 మంది లైన్మన్లు, 43 మంది సబ్‌స్టేషన్లలో పనిచేసే ఆపరేటర్లు, 23 మంది లైన్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీలు చేశారు. కొంతమందికి పైరవీలతో బదిలీలు అయ్యాయనే ఆరోపణలు వచ్చాయి.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



నాగర్‌కర్నూల్ : విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ రామేశ్వర్

కందనూలు, న్యూస్‌టుడే : కళాశాల విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్ హెచ్చరించారు. పట్టణంలోని వైద్య కళాశాలలో శుక్రవారం యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశం నిర్వహించగా అదనపు ఎస్పీ పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు. తోటి విద్యార్థుల నుంచి ఎలాంటి ఇబ్బందులు కల్గిన తక్షణమే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలకు దూరంగా ఉండాలన్నారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం షీటీం సిబ్బంది నిరంతరం పని చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ గౌసియా, షీ టీం ఏఎస్సై విజయలక్ష్మి, సఖి కేంద్రం సమన్వకర్త సునీత, భరోసా కేంద్రం సమన్వయకర్త శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబసభ్యులకు సాయం అందిస్తున్న మైనార్టీ మహిళలు

చారకొండ (వెల్దండ గ్రామీణం), న్యూస్‌టుడే: చారకొండ మండలం జూపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందిన ఎండీ నజీర్ కుటుంబసభ్యులను మైనార్టీ మహిళలు శుక్రవారం పరామర్శించారు. బాధితుడికి ముగ్గురు ఆడపిల్లలు ఉండటంతో గ్రామానికి చెందిన మైనార్టీ మహిళలు విరాళాలు సమకూర్చుకొని రూ.50వేలను స్థానిక పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసి ఆ పత్రాలను కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సాజిదా, సాధికా, జహీదా, జరీనా, హసీనా తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను అభివృద్ధి చేస్తాం: మంత్రి


పూజలు నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు

అలంపూర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రజలకు సేవలు చేయడానికి అనుకూల పరిస్థితి కల్పించాలని, శక్తి ఇవ్వాలని జోగులాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామిని కోరినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆలయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహాయంతో ప్రణాళిక సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామన్నారు. ప్రజల సహకారంతో ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి జోగులాంబ అమ్మవారి సన్నిధిలో ఒక సత్రాన్ని నిర్మించేందుకు స్థలం సేకరించామని, త్వరలో శంకుస్థాపన చేసి నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. అమ్మ వారి సన్నిధి నుంచి హారతి అనంతరం భక్తులు సులభంగా తిరిగి వెళ్లేందుకు అలంపూర్ చౌరస్తా వరకు ఆర్టీసీ బస్సులు ప్రతి రోజూ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకు పూర్వం మంత్రి దంపతులు కుటుంబ సమేతంగా ఆలయాలను దర్శించుకున్నారు. మంత్రి దంపతులకు ఈవో పురేందర్, ఆలయ ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి స్వాగతం పలికారు. కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస్‌రావు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ఆర్డీవో రామచందర్ తదితరులున్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు చర్యలు

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: శ్రీశైల ఉత్తర ద్వారమైన శ్రీ ఉమామహేశ్వర క్షేత్రం (బోగమహేశ్వరం)లో పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు దేవస్థాన ఛైర్మన్ మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం క్షేత్రంలోని పంచలింగాల ఆలయం, ఆంజనేయస్వామి దేవాలయ నూతన నిర్మాణానికి ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ప్రతిపాదనలను సిద్ధం చేశారు. సకాలంలో పనులను పూర్తి చేసేలా నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఏఈ బాలయ్య, ఈవో శ్రీనివాస్‌రావు, అర్చకుడు వీరయ్యశాస్త్రి, సభ్యులు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : తెల్కపల్లి మండలంలోని ఓ గ్రామంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిపై ఖాజాసైదుద్దీన్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. భారత సైన్యంలో విధులు నిర్వహించినప్పటి చిత్రాల (ఫ్లెక్సీలు)ను ఏర్పాటు చేసి అచ్చంపేట పట్టణానికి సమీపంలో ఓ పెట్రోల్ బంక్ నిర్వహిస్తున్నాడని, గ్రామంలో కార్యదర్శిగా న్యాయం చేయడం లేదని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో), కలెక్టర్, ప్రజా సంబంధాల అధికారి, అచ్చంపేట పుర కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఆర్మీలో పనిచేసినప్పటి చిత్రాలను తొలగించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. విషయం పై తెల్కపల్లి ఎంపీడీవోను వివరణ కోరగా సంబంధిత కార్యదర్శి 17, 18 తేదీలలో సెలవులో ఉన్నట్లు తెలిపారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి

తాడూరు, న్యూస్‌టుడే : గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జ్యోతిపరూసియా సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న గ్రామ మంచినీటి సహాకుల శిక్షణ శిబిరానికి హాజరైన ఎంపీడీవో మాట్లాడారు. వాటర్ ట్యాంక్‌లు, సంపులను క్రమం తప్పకుండా శుభ్ర పర్చడంతో పాటు పైపులైన్లు లీకేజీ లేకుండా చూడాలన్నారు. మోటార్ల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మిషన్‌భగీరథ ఏఈ శివశంకర్, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని పుర అధ్యక్షుడు ఎడ్మసత్యం అన్నారు. శనివారం వివేకానంద సేవా బృందం, జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని సరస్వతీ శిశుమందిరం పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రతకు ఇచ్చే ప్రాధాన్యతను పరిసరాల శుభ్రతకు ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛభారత్ నిర్మాణానికి పాటు పడాలన్నారు. అనంతరం విద్యార్థులకు స్వచ్ఛభారత్ కిట్ (టోపి, పెన్ను, డైరీ) అందజేశారు. కార్యక్రమంలో సేవా బృందం అధ్యక్షుడు శివ, పాఠశాల ప్రధానాచార్యులు రాజు, నాయకులు ఆంజనేయులు, హర్షిత్, చింటు పాల్గొన్నారు.


సీఎం హామీ నెరవేర్చాలి : తపస్

లింగాల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానం రద్దు చేయాలని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం లింగాలలో ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. సంఘం సభ్యులు శేఖర్, సతీష్‌కుమార్ శ్రీవాస్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

ఎనిమిదోసారి

వెల్దండలో కేఎల్ఐ డి-82 కాల్వకు మరోసారి గండి

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే: వెల్దండ మండల కేంద్రం సమీపంలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డి-82 ప్రధాన కాల్వకు గురువారం రాత్రి గండి పడింది. గుడిపల్లి జలాశయం నుంచి కేఎల్ఐ ప్రధాన కాల్వ ద్వారా దిగువకు సాగునీటిని విడుదల చేయడంతో ఈనెల 11న వెల్దండ మండలం పోతేపల్లి శివారుకు సాగునీరు చేరింది. డి-82 ప్రధాన కాల్వ భూగర్భ వంతెన 28 కిలో మీటరు వద్ద గండి పడటంతో కాల్వలోని నీరంతా సమీప చెరువులోకి పోయింది. ఈకాల్వకు కుడి, ఎడమ వైపుల ఇక్కడే ఏడోసారి గండి పడగా ఇక్కడ ఇది రెండోసారి గండి పడటం గమనార్హం. సెప్టెంబర్ 4న రాత్రి ఎడమ వైపు గండి పడగా ఈనెల 15న రాత్రి కుడి వైపు గండి పడింది. చిన్నపాటి వర్షం కురిసిన, కాల్వలోకి నీటి వరద అధికమైన ఏటా గండి పడటం పరిపాటిగా తయారైంది. దీంతో పొలాలు నీట మునుగుతున్నాయి. పత్తి, వేరుశనగ పొలాలు కోతకు గురి కావడంతో పాటు ఇసుకమేటలతో నిండిపోయాయి. శుక్రవారం నీటి పారుదల శాఖ డీఈ సమ్మయ్య కాల్వను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. త్వరలోనే కాల్వకు మరమ్మతులు చేపట్టి గండిని పూడ్చుతామన్నారు. ఏఈ మహేశ్, లాస్కర్ భరతమ్మ పాల్గొన్నారు.


కాల్వకు గండిపడి వృథాగా పోతున్న నీరు

మెప్మా సీవో యాదయ్యపై వేటు

కోయనగర్ సమాఖ్య వ్యవహారంలో సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశం

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే: కోయనగర్ మహిళా సంఘాల సమాఖ్య వ్యవహారంలో మెప్మా సీవో(కమ్యూనిటీ ఆర్గనైజర్) జి.యాదయ్యపై వేటు పడింది. ఆ విధుల నుంచి ఆయన్ని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల దస్త్రం మెప్మా ఇన్‌ఛార్జి పీడీ సురేందర్‌రెడ్డికి చేరింది. మహిళల పొదుపు సొమ్ము, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల నగదును సొంతానికి వాడుకున్న ఆర్పీ శ్రీలతపై ఠాణాలో కేసు నమోదు చేయడంతో పాటు డబ్బు రికవరీ చేయాలని కమిషనర్ మహేశ్వర్‌రెడ్డిని ఆదేశించారు. కోయనగర్ మహిళా సంఘాల సమాఖ్యలో డబ్బు దుర్వినియోగంపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. ఈ కథనాలతో స్పందించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల పుర కమిషనర్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి మెప్మా సీవోలతో సమీక్ష నిర్వహించారు. ఆర్పీ శ్రీలత రూ.కోట్లలో మహిళల సొమ్ము పక్కదారి పట్టిస్తే సీవోలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కోయనగర్ వ్యవహారంలో సంఘాల సభ్యులు నష్టపోరాదని, అక్రమాలకు పాల్పడ్డ ఆర్పీపై క్రిమినల్ చర్యలు తప్పవని, మిగతా ఆర్పీలపై సీవోలు దృష్టి సారించాలని సూచించారు. ఈ వ్యవహారంపై తుది నివేదిక రాగా కలెక్టర్, అదనపు కలెక్టర్.. మెప్మా ఇన్‌ఛార్జి పీడీ సురేందర్‌రెడ్డితో సమీక్ష నిర్వహించారు. కోయనగర్ సమాఖ్యలో మూడేళ్లుగా జరుగుతున్న అవకతవకలు గుర్తించడంలో సీవో యాదయ్య పూర్తి నిర్లక్ష్యంతో బాధ్యతారాహిత్యంగా పనిచేశారని గుర్తించిన కలెక్టర్ అతన్ని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

రోడ్డుపై మొక్కలను తొలగించండి

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : రహదారికి ఇరువైపులా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించాలని అమరగిరి వాసి భరత్‌కుమార్ కోరారు. శుక్రవారం ఆయన అటవీశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపుల ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల కొమ్మలు రోడ్డు పైకి రావడంతో ద్విచక్రవాహనదారులు, బస్సుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. అనంతరం వినతిపత్రం అందజేశారు.

దేశ ముఖచిత్రాన్ని మార్చేది విద్యే

హైసియా విద్యా సదస్సులో మంత్రి సీతక్క

రాయదుర్గం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ నిధులను వెచ్చించాలని, ఒక్కో గ్రామాన్ని దత్తతకు తీసుకుని అన్నివిధాలా దన్నుగా నిలవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇన్ఫోసిస్ సంస్థ సమావేశం మందిరంలో శుక్రవారం హైసియా (హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్) ఆధ్వర్యంలో విద్యా సదస్సు నిర్వహించారు. మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. విద్యా సదస్సు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విద్యను ప్రోత్సహించేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. దేశముఖ చిత్రాన్ని మార్చగలిగేది విద్య మాత్రమేనని అన్నారు. సమానత్వ సాధనలో విద్య కీలకమని, ప్రభుత్వం ఆ దిశగా కృషి చేస్తోందని తెలిపారు. ఇందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని కోరారు. హైసియా ఆధ్వర్యంలో.. అచ్చంపేట, ఆదిలాబాద్, ములుగు, భద్రాచలం వంటి అటవీ ప్రాంతాల్లో విద్యావ్యాప్తికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం ఆదర్శనీయమన్నారు. అటవీ శాఖ అభ్యంతరం పెడితే.. కంటైనర్ ఆస్పత్రి, కంటైనర్ పాఠశాల ప్రారంభించామని గుర్తుచేశారు. ములుగు కలెక్టర్ దివాకర్ టీఎస్ ప్రసంగిస్తూ.. మారుమూల ప్రాంతాల్లో నాణ్యమైన విద్యను అందించడం సవాళ్లతో కూడుకుందన్నారు. సామాజిక కట్టుబాట్లు విద్యాభివృద్ధికి అవరోధంగా నిలుస్తున్నాయని చెప్పారు. బాలికలను బడికి పంపించడం కంటే ఇంటి పనులు చేయించడానికే ప్రాధాన్యమిస్తున్నారు. మాజీ ఐఏఎస్ ఆఫీసర్ ఆకునూరి మురళి, వివిధ సాఫ్ట్‌వేర్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

తెల్లారితే పెళ్లిచూపులు.. యువతి అదృశ్యం

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : యువతి అదృశ్యమైన ఘటనలో కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రేమ్‌నాయక్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతికి శుక్రవారం పెళ్లిచూపులు జరగాల్సి ఉండగా గురువారం అర్ధరాత్రి అందరు నిద్రిస్తుండగా అదృశ్యమైంది. తెల్లవారుజామున గమనించిన తల్లి ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : పురుగు మందుతాగి ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని చేగుంటలో చోటు చేసుకుంది. ఏఎస్సై ప్రిసిల్లా కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కవిత (38) ఈనెల 14న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగు మందు తాగింది. కొద్ది సేపటి తర్వాత గుర్తించిన కుటుంబీకులు వెంటనే మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి దాడి

ఊర్కొండ, న్యూస్‌టుడే : వ్యక్తిపై బీరు సీసాతో దాడి చేసి ఆపై ఆత్మహత్యా యత్నం చేసిన ఘటన శుక్రవారం మండలంలోని ఊర్కొండపేట గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల తెలిపిన వివరాల ప్రకారం ఊర్కొండపేట గ్రామానికి చెందిన మహేశ్ కొంతకాలంగా మతి స్థిమితం లేక అవస్థ పడుతున్నాడు. మూడు రోజులుగా గ్రామ శివారులోని ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం మహేశ్ గ్రామ శివారు పొలంలో పని చేసుకుంటున్న అంజయ్యపై బీరు సీసాదాడి చేసి గాయపరిచాడు. గమనించిన స్థానికులు కేకలు వేయడంతో ద్విచక్ర వాహనంపై అటుగా వెళ్తున్న అప్రమత్తమై మల్లేశ్‌ను పట్టుకోవడానికి ప్రయత్నించారు. చేతిలో ఉన్న బీరు సీసాతో గొంతు కోసుకున్నాడు. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో గాయపడిన యువకుడిని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆసుపత్రికి తరలించారు. బీరు సీసాదాడిలో గాయపడిన అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వీరబాబు తెలిపారు.

మేకల మందపై కుక్కల దాడి

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : వెన్నచర్లలో శుక్రవారం మేకల మందపై కుక్కలు దాడిచేయడంతో నాలుగు మేకలు మృతిచెందాయి. మరో 6 మేకలు తీవ్ర గాయాలయ్యాయని బాధితులు దేవరపాగ మహేష్, దేవరపాగ నాగరాజు వాపోయారు.

వివాహిత అదృశ్యం

కందనూలు, న్యూస్‌టుడే : పురపాలక సంఘం పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వివాహితకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. ప్రస్తుతం ఇద్దరు పిల్లలు. శుక్రవారం కుటుంబ సభ్యులకు చెప్పకుండా పిల్లలను విడిచి పెట్టి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. పలు చోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. వివాహిత భర్త పట్టణంలోని ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ పేర్కొన్నారు.

రైతుకు తీవ్ర గాయాలు

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : పొలాన్ని చదును చేసే యంత్రంలో పడి ఓ యువ రైతు పడి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. వెల్దండ మండలం పోచమ్మగడ్డతండాకు చెందిన వడ్త్యావత్ పవన్‌నాయక్(21) తన పొలంలో శుక్రవారం భూమిని తిరగబట్టే యంత్రం (రొటొవేటర్)తో చదును చేయిస్తుండగా ట్రాక్టర్ ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి యంత్రంలో పడి పోయాడు. కుడి పాదం మధ్యలో విరిగిపోగా, ఎడమ కాలు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వెల్దండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసు

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే: గట్టుతుమ్మెన్‌లో ఇరువర్గాలు పరస్పరం దాడికి పాల్పడిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చాంద్‌పాషా తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీటి ప్రవాహంతో పాటు గేదెలతో పారిశుద్ధ్యం లోపిస్తోందని ఈ నెల 17న వెంకటయ్య మరో కుటుంబానికి చెందిన సరస్వతి రెండు కుటుంబాలకు చెందిన వ్యక్తులు కర్రలతో పరస్పరం దాడి చేసుకున్నారు. పరస్పర ఫిర్యాదుతో శుక్రవారం సరస్వతి, వెంకటయ్య, నారమ్మ, శ్రీను మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రెండు రోజుల జైలుశిక్ష

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన మహ్మద్ ఆశ్రఫ్‌కు కల్వకుర్తి కోర్టులో శుక్రవారం న్యాయమూర్తి కావ్య రెండు రోజుల జైలుశిక్షతో పాటు రూ.500లు జరిమానా విధించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు ఉంటాయని ఎస్ఐ తెలిపారు.